## క్లుప్తంగా

### జాతరకు తరలిరండి



జాతర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

నరసన్నపేట: అంపలాం–గొట్టిపల్లి మధ్య ఉన్న శివాలయం వద్ద ఈ నెల 16న హాలా హలేశ్వరుని జాతర నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు. ఆదివారం యాత్ర స్థలం వద్ద విలేకర్ల సమావేశం నిర్వహించారు. దీంట్లో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు శిమ్మ లక్ష్మణరావు ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్‌లు అవ్వ రవీంద్రనాథ్, అల్లు అసిరినాయుడు యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ యాత్ర ప్రాధాన్యతను వివరించారు. గడిచిన వంద ఏళ్ల నుంచి యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాది మంది తరలివచ్చే ఈ యాత్రలో భక్తులు సామరస్యపూర్వకంగా మెలగాలని కోరారు. పరిసర గ్రామాల ప్రజలు సహకరించాలని విన్నవించారు.

### కృతజ్ఞతలు



అమర రమణ

పాతపట్నం: వైఎస్సార్‌ సీపీ అభివృద్ధికి పార్టీ నాయకులతో కలిసి పని చేస్తానని పార్టీ జిల్లా సెక్రటరీ అమర రమణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ పదవి దక్కడంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని మరింత పెంచుకుంటానని రమణ తెలిపారు.

### రహదారి నిబంధనలు పాటించాలి



ఎస్‌ఐ ఎండీ యాసిన్‌

హిరమండలం: వాహనదారులు రహదారి నిబంధనలు కచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని స్థానిక ఎస్‌ఐ ఎండీ యాసిన్‌ సూచించారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాలతోపాటు హిరమండలం మేజర్‌ పంచాయతీలో ఆటో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. జూదం, కోడిపందేలు ఆడితే చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతి నేపథ్యంలో గ్రామాలన్నీ వచ్చేపోయే వారితో రద్దీగా ఉన్నాయని, వాహనాలు నడిపేవారు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

### గోకులాల ప్రారంభం



గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్‌

ఆమదాలవలస: గోకులాల నిర్మాణంతో పాడి అభివృద్ధి జరుగుతుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌ అన్నారు. ఆమదాలవలస మండలం కొత్తవలసలో ఉపాధి హామీ పథకం నిధులతో రైతులు నిర్మాణం చేపట్టిన గోకులాలను ఆదివారం ప్రారంభించారు. ఎంపీడీఓ రోణంకి వెంకటరావు, పశు సంవర్ధక శాఖ ఏడీ ఆర్‌.ఆనందరావు, ఏపీడీ లోకేష్‌, ఏపీఓ లక్ష్మీనరసమ్మ, పశువైద్యాధికారి ఓంకార్‌, తొగరాం ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి శ్రీనివాసరావు, తొగరాం సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నిత్యావసరాల వితరణ




చాపరలో నిత్యావసరాలు అందజేస్తున్న కిల్లంశెట్టి శ్రీదేవి

మెళియాపుట్టి: 'చారిటీ బాక్స్‌' పేరుతో పలువురు పేదలకు నిత్యావసరాలు అందిస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధి, చాపర గ్రామానికి చెందిన కిల్లంశెట్టి శ్రీదేవి అన్నారు. ఆదివారం చాపర గ్రామంలోని పలువురికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. చారిటీ బాక్స్‌ ద్వారా అనేకమంది పేదలకు అండగా ఉన్నామని, సంక్రాంతి సందర్భంగా బియ్యం, 15 రకాల సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. శ్రీకాకుళంతోపాటు విశాఖపట్నం, కాకినాడ, పశ్చిమగోదావరి, బాపట్ల జిల్లాల్లో పంపిణీ చేశామన్నారు.

### నేటినుంచి సోమాలమ్మ వార్షికోత్సవం

సరుబుజ్జిలి: ఈ నెల 13 నుంచి 16 వరకు చిన్నపాలెం గ్రామ సమీపంలోని దంతపురి క్షేత్రంలో గల సోమాలమ్మ దుర్గాంబ అమ్మవారి ఆలయ 22వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త మెండ సూర్యారావు ఆదివారం తెలిపారు. ఆలయ అర్చకులు మావుడూరి కృష్ణారావు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రతీరోజు సహస్రనామార్చనలు, కుంకుమ పూజలు చేస్తామన్నారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

# పందెం కోడి రెడీ!



దేగపుంజు: బరిలో దిగితే అందరి దృష్టి ఈ పుంజుపైనే



కత్తికడితే గెలుపే: గిరాకీ ఉన్న కోడి పుంజు



తెలుపు శుభం: తెల్లపుంజులకు మంచి గిరాకీ..

- 'పుంజు'కున్న గిరాకీ
- పందెం కోడి ధర రూ.5 వేల నుంచి రూ.10 వేలు

ఎల్‌.ఎన్‌.పేట:

సంక్రాంతి పురస్కరించుకుని కోడి'పుంజు'లను రెడీ చేశారు. కోడి పందేలకు పరుగులు తీస్తున్నారు. మరోవైపు కోడి పుంజులకు గిరాకీ ఏర్పడింది. ఒకవైపు కోడి పందేలాటలకు, మరోవైపు కనుమ నాడు వండుకుని తినే నాటుకోడి కూర కోసం కోడిపుంజులను వినియోగిస్తుంటారు. కోడి కూరకంటే.. కోడి పందేలాటకే వీటిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రతీ ఏడాది మండలంలోని రావిచెంద్రి, చొర్లంగి, పూశాం, కొత్తపేట, బాలేరు తదితర గ్రామాల సమీపంలోని తోటల్లో కోడి పందేలాటను నిర్వహిస్తుంటారు. కోడి పందెం కోసం పరిసర గ్రామాలకు చెందిన అన్ని వర్గాలవారు అధికంగా వస్తుంటారు. ఈ సమయంలో పందేలాటలకు పుంజులకు మంచి డిమాండ్‌ ఏర్పడుతుంది. పందేలకు పనికి వచ్చే కోడిపుంజు ఒకటి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ధర చెల్లించి కొనుగోలు చేస్తుంటారు. మండలంలోని పలు గ్రామాల్లో కొన్ని కుటుంబాలకు చెందినవారు కోడి పందేలాటలకు పుంజులను అమ్మేందుకు పెంచుతుంటారు.



పౌరుషం: పందెం గెలవాలంటే పౌరషం నూరిపోయాల్సిందే..

## క్రికెట్‌ టోర్నీ విజేత పూసర్లపాడు



పూసర్లపాడు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీపీ, తదితరులు

నరసన్నపేట: మండలంలోని తామరాపల్లి వద్ద స్పిన్నింగ్‌ మిల్లు ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్‌ టోర్నమెంట్‌ విజేతగా పూసర్లపాడు నిలిచింది. ఫైనల్‌ మ్యాచ్‌లో సత్తాచాటి సత్యవరం జట్టుపై 21 పరుగులతో విజయం సాధించింది. 3వ తేదీ నుంచి టోర్నమెంట్‌ నిర్వహిస్తున్నారు. 40 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌ చేసిన పూసర్లపాడు 10 ఓవర్లలో 102 పరుగులు చేసింది. 103 పరుగుల లక్ష్యంతో దిగిన సత్యవరం జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 80 పరుగులు మాత్రమే చేసింది. యగళ్ల సంతోష్‌, కోల త్రినాథ్‌ల జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్‌ను టీఎంపీఎల్‌ పేరిట అభిమానులు నిర్వహించారు. విజేతలకు ఎంపీపీ ఆరంగి మురళి, బంగారు వ్యాపారవేత్త ఊణ్ణ రంగనాథ్‌, వైఎస్సార్‌సీపీ నాయకులు మచ్చ గణేష్‌ ట్రోఫీ అందించారు. స్థానిక యువకులు శివకుమార్‌, అనిల్‌, వాసు, తవిటి నాయుడు పాల్గొన్నారు.

## మౌలిక వసతులతో గ్రామాల అభివృద్ధి

జలుమూరు: మౌలిక వసతులైన రోడ్లతో గ్రామాలు మరింత అభివృద్ధి చెంతాయని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. జలుమూరు నుంచి వెంకటాపురం మీదుగా బుడితిని కలుపుతూ రూ.2 కోట్లతో నిర్మాణం జరిగిన బీటీ రోడ్డును ఆదివారం ప్రారంభించారు. ఎంపీపీ వాన గోపి, ఎంపీడీఓ కె.అప్పలనాయుడు, ఇంజినీరింగ్‌ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**సారవకోట మండలంలో..**

సారవకోట: మండలంలో పల్లె పండగ కార్యక్రమంలో నిధులు మంజూరు చేసి నిర్మించిన రోడ్లను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి ఆదివారం ప్రారంభించారు. జమచక్రం నుంచి బుడ్డయ్యపేట మీదుగా కిడిమి రోడ్డు, సోమయ్యపేట రహదారులను ప్రారంభించారు. అన్ని గ్రామాల్లోనూ రహదారులు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఇంజినీరింగ్‌ అధికారులు, నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వివేకానందుడు యువతకు స్ఫూర్తి

ప్రపంచానికి దేశ గొప్పతనాన్ని చాటి చెప్పిన వివేకానందుడు నేటి యువతకు ఆదర్శమని వక్తలు అన్నారు. వివేకానందుడి 162వ జయంతి సందర్భంగా ఆదివారం జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాతపట్నం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల్లో వివేకానందుడి చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామీ వివేకానందుడు చూపిన మార్గంలో యువత పయనించి నవ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్‌



నరసన్నపేట: వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న సామాజిక సమరసత వేదిక ప్రతినిధులు



పాతపట్నం: లాబరలో విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎంపీపీ దొర సావిత్రమ్మ, సీఐ రామరావు



నరసన్నపేట: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీజ్ఞానజ్యోతి స్కూల్‌ విద్యార్థులు



సారవకోట: అలుదు విజయాంబికా యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నరసన్నపేట ఎమ్మెల్యే రమణమూర్తి



కొత్తూరు: ప్రభుత్వ జూనియర్‌ కాలేజీలో వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న రిటైర్డ్‌ హెచ్‌ఎం గోపాలదాసునాయుడు, అధ్యాపకులు



మెళియాపుట్టి: గాతలవలసలో వివేకానంద జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న గ్రామస్తులు



పొందూరు: హైస్కూల్లో వివేకానందుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న యంగ్‌స్టార్‌ యూత్‌ క్లబ్‌ ప్రతినిధులు



బూర్జ: మదనాపురంలో వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, యువకులు



జలుమూరు: శ్రీముఖలింగంలో రక్తదానం చేస్తున్న చేయూత గ్రూప్‌ సభ్యులు



పొందూరు: 1992-93 టెన్త్‌ బ్యాచ్‌

## అపూర్వ కలయిక

పొందూరు: మండలంలోని కింతలి పీఎల్‌ఎన్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో 1992–93లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకుని సందడి చేశారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు గుడ్ల పకీర్‌, బి.ఎస్‌.ప్రసాదరావు, బి.వెంకటనాయుడు, జి.అప్పన్న, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, కె.లక్ష్మణరావు, పి.పాపారావును సన్మానించారు.

**ఆపదలో ఉన్నవారిని ఆదుకుందాం..**

ఆమదాలవలస: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు తామంతా ముందు ఉంటామని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–94లో పదో తరగతి చదువుకున్న కె.పూర్ణచంద్రరావు, సుబ్రహ్మణ్యం, బి.రాజేష్‌, జి.సునీల్‌, జగన్‌ అన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని పట్టణంలో ఆదివారం నిర్వహించారు. గత 30 ఏళ్ల జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. ఇంతవరకు ఎంతమందికి సహాయం అందించాం, భవిష్యత్‌ కార్యాచరణపై చర్చించారు. పూర్వ విద్యార్థులు కె.సుధాకర్‌, బి.అప్పలనాయుడు, పి.సురేష్‌, బి.శ్రీనివాసరావు, జె.ఉపేంద్ర, కాశీ, జి.హరిబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వామీ వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించారు.



ఆమదాలవలస: 1993-94 పదో తరగతి విద్యార్థులు

**ఆత్మీయ సమ్మేళనం**

కొత్తూరు: మండలంలోని నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1993–94 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. అప్పటి హెచ్‌ఎం ఎద్దు గోపాలదాసునాయుడు, ప్రస్తుత హెచ్‌ఎం సువ్వారి నిర్మల, అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాలలో సైకిల్‌ షెడ్‌ నిర్మాణం, స్టేజ్‌ అభివృద్ధికి పూర్వ విద్యార్థి నక్క శంకరరావు రూ.లక్ష, దార్లపూడి రాధాకృష్ణ రూ.లక్ష, బిల్డింగ్‌ రంగారావు రూ. 50 వేలు, మరో ముగ్గురు విద్యార్థులు చెరో రూ.10 వేల చొప్పున విరాళాలు అందజేశారు.



కొత్తూరు: 1993-1994 బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థులు

## వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



చింతాడ వెంకట సత్యప్రసాద్‌

పొందూరు: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతానికి కృషి చేస్తానని మండలంలోని గోకర్నపల్లి గ్రామానికి చెందిన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ వెంకట సత్యప్రసాద్‌ అన్నారు. ఈయన గతంలో ఎంపీటీసీగా, నీటి సంఘం అధ్యక్షునిగా, పీఏసీఎస్‌ డైరెక్టర్‌గా సేవలందించారు. ఈయన భార్య చింతాడ మాధురి గోకర్ణపల్లి సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. ఈ పదవి దక్కడం పట్ల మాజీ స్పీకర్‌ తమ్మినేని సీతారాం, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌, ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌ కు సత్యప్రసాద్‌ కతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో హర్షం వ్యక్తం చేశారు.

### 20 మద్యం సీసాల స్వాధీనం

బూర్జ: మండలంలోని కొల్లివలస జంక్షన్‌ వద్ద 20 మద్యం సీసాలను ఆదివారం పట్టుకున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఖాఖండ్యాం గ్రామానికి చెందిన ధర్మవరపు ఆదినారాయణ వద్ద నుంచి 8, గొటివాడ మల్లేష్‌ వద్ద నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు విజయనగరం జిల్లా ఆర్‌.ఎ.వలస మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి మద్యం సీసాలు పట్టుకొని వస్తుండగా గుర్తించామన్నారు. నలుగురిపై కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ పి.వి.రమణ తెలిపారు.

### దొంగలు ఉంటారు జాగ్రత్త



సంక్రాంతికి స్వగ్రామాలకు వెళ్లేముందు, ఇళ్లకు తాళాలు వేసేటప్పుడు పక్కింటి వారికి సమాచారం ఇవ్వాలని, పోలీసులకు తెలియజేయాలని పాతపట్నం ఎస్‌ఐ బి.లావణ్య, ఏఎస్‌ఐ అప్పారావు అన్నారు. పాతపట్నంలో ఆదివారం ఆటోతో ప్రచారం చేపట్టారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు తారసపడితే 100కు, 112కు తెలియజేయాలన్నారు. ఆటోల్లో, బస్సుల్లో ప్రయాణించేటప్పుడు విలువైన వసులను గమనించాలన్నారు.

– పాతపట్నం

### దుప్పట్ల పంపిణీ



కొత్తూరు మండలంలోని మెట్టూరు గూడలో 50 మంది గిరిజనులకు పీఏసీఎస్‌ మాజీ చైర్మన్‌ చింతాడ సూర్యనారాయణ ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. సంక్రాంతి సందర్భంగా గిరిజనులకు ప్రతీ ఏడాది దుప్పట్లు పంపిణీ చేస్తునట్లు సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సూర్యనారాయణకు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

– కొత్తూరు

### కుడారై మహాప్రసాద సేవ



సారవకోట మండలంలోని చీడిపూడి వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం భక్తిశ్రద్ధలతో కుడారై మహా ప్రసాద సేవ నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి 108 వెండి గిన్నెల్లో నైవేద్యం ఏర్పాటు చేసి కుడారై మహా ప్రసాద సేవ చేపట్టినట్లు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు.

– సారవకోట